కుండపోత వర్షం

- దివిసీమలో పలు ప్రాంతాలు జలమయం
- జిల్లాలో అత్యధికంగా చల్లపల్లిలో 71.8 మి.మీ వర్షపాతం
- మామిడికి నష్టం.. దుక్కులకు మేలు

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8.30 వరకూ కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అవనిగడ్డలో తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై రెండగుల మేర నీరు నిలిచింది. ఒకటవ వార్డు, లంకమ్మ మాన్యం, రాజశేఖరపురం, మండలినగర్, 9వ వార్డులోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. చల్లపల్లి నారాయణరావునగర్‌లోని పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. మచిలీపట్నంలో బస్టాండ్ సెంటర్‌లో రహదారిపై నీరు కుదరడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మామిడి రైతుకు తీవ్ర నష్టం

మంగళవారం కురిసిన భారీ వర్షం మామిడి తోటలకు నష్టం చేకూర్చింది. అవనిగడ్డ నియోజకవర్గంలో 1,080 ఎకరాల్లో పలు రకాల మామిడి తోటలను సాగు చేస్తుండగా ఈదురు గాలులతో కూడిన వర్షంతో కొన్నిచోట్ల మామిడి కాయలు రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది మామిడి కాపు తక్కువగా ఉండటంతో ఆందోళన చెందుతున్న రైతులకు ఈ వర్షం మరింత నష్టాన్ని కలిగించింది.

మెట్ట పొలాలకు మేలు

మెట్ట పొలాలకు ఈ వర్షం మేలు చేసింది. పలురకాల వాణిజ్య, కూరగాయల పంటలకు ఈ వర్షం ఊపిరి పోసినట్టయింది. వరిసాగుచేసే మాగాణి పొలాలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. ఎండల కారణంగా దుక్కులు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు కుండపోత వర్షంతో భూమి మెత్తబడి దుక్కులు బాగా వస్తాయని కొంతమంది రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చల్లపల్లిలో అత్యధిక వర్షపాతం

నియోజకవర్గంలోని చల్లపల్లిలో అత్యధికంగా 71.8మి.మీ వర్షపాతం నమోదైంది. మోపిదేవిలో 70.2, ఘంటసాలలో 69.2, అవనిగడ్డలో 57.4, మచిలీపట్నంలో 54.2, నాగాయలంకలో 50.8, బంటుమిల్లిలో 46.2, గూడూరులో 36, కోడూరులో 31.2, పెడనలో 28.8, కృత్తివెన్నులో అత్యల్పంగా 18.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం ముందు నీట మునిగిన ప్రధాన రహదారి



పెడనలో ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో మూడోరోజు మంగళవారం కూడా భారీ వర్షం కురిసింది. తెల్లవారు జాము నుంచి భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 9.30 గంటల వరకూ వర్షం కురుస్తూనే ఉంది. ఆ తర్వాత వర్షం తెరిపివ్వడంతో నగర వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం దాదాపు 3 సెంటీ మీటర్లు, సోమవారం 3 సెంటీ మీటర్లు, మంగళవారం 5 సెంటీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. వర్షానికి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు జలమయమయ్యాయి.

పెడనలో ..

పెడన: పెడనలో సోమవారం అర్ధరాత్రి, మంగళవారం వేకువ జామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. 2.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కచ్చా డ్రెయిన్లు, రోడ్లపై వర్షం నీరు ఏకమయ్యాయి. ప్రధాన రహదారిలో వర్షం నీరు నిలిచి ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వర్షం నీటిని డ్రెయిన్లలోకి పోయేలా చర్యలు తీసుకున్నారు.



చల్లపల్లి లయన్స్ కాంప్లెక్స్ వద్ద వర్షం నీటిలో చిరు వ్యాపారుల బండ్లు

నీట మునిగిన రహదారులు

ఘంటసాల: మండల కేంద్రం ఘంటసాలలో కురిసిన భార్షీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘంటసాల, మల్లంపల్లి వెళ్లే ప్రధాన రహదారి, ఘంటసాల, రామానగరం వెళ్లే ప్రధాన రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. ఘంటసాలలోని ప్రభుత్వ పశు వైద్యశాలకు వెళ్లే రహదారి నీట మునగడంతో ఆస్పత్రికి పశువులను తీసుకెళ్లే రైతులు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే సమస్యకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: భారీ వర్షానికి చల్లపల్లి జలమయమైంది. ఉరుములు, పిడుగులు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మురుగు కాలువల్లో వర్షం నీరు పారుదల లేక రోడ్లపైనే నిలిచిపోయాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. లయన్స్ కాంప్లెక్స్ వద్ద గజం లోతు ఎత్తులో నీళ్లు నిలిచిపోవడంతో తోపుడు బండ్లు, వీధి దుకాణాలు వాన నీటిలో మునిగాయి.



చల్లపల్లి-మచిలీపట్నం రోడ్డులో డ్రెయిన్‌కు అడ్డుపడిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారావు

మచిలీపట్నంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేదలకు వ్యతిరేకంగా కొత్త చట్టాలు తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు ఆరోపించారు. కోనేరు సెంటర్లో మంగళవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కార్మిక వర్గాలు ఐకమత్యంగా 22సార్లు సమ్మె జరిపాయన్నారు. కార్మికుల ఐక్యతను చూసి భయపడుతున్న కేంద్రం ఇప్పటి వరకు తాను తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయకుండా అవకాశం కోసం ఎదురు చూస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేయడానికి వీల్లేదు అంటూ కార్మికులు నేటి నుంచి సమ్మెకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్ మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకి సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మండల కార్యదర్శి చిరువోలు జయరావు, ఆశ వర్కర్ల సంఘం జిల్లా కోశాధికారి కిరణ్మయి, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీలు తక్షణం అమలు చేయాలి

పెడన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పెడన బస్టాండ్ సెంటర్ నుంచి బంటుమిల్లి రోడ్డు వరకు ప్రదర్శన చేశారు. నేతలు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు అమలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని కోరారు. ఈ ప్రదర్శనలో సీఐటీయూ పెడన మండల నాయకులు పంచల నరసింహారావు, గోరు రాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మికులను మోసం చేస్తున్న పాలకులు

ఘంటసాల: ఎన్నికల ముందు ప్రజలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావులు ఆరోపించారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశ వ్యాప్త నిరసనలో భాగంగా ఘంటసాల సత్రవు సెంటర్లో సీఐటీయూ నేతలు నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతు, మేడంకి వెంకటేశ్వరరావు, గొరుముచ్చు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: నాలుగు లేబర్ కోడులను రద్దుచేసి కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని రైతు సంఘం మండల నాయకులు యద్దనపూడి మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మేడేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక ప్రధాన సెంటర్లో మంగళవారం సాయంత్రం సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వృత్తి సంఘం జిల్లా నేతలు వాకా రామచంద్రరావు, కౌలు రైతు సంఘం నేతలు తలారి నాగేశ్వరరావు, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు చల్లపల్లి గంగాభవాని, మహ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.

బంటుమిల్లి: పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం నిరసన తెలియచేసి తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.

అవనిగడ్డ: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో సంఘీభావ ర్యాలీ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోలినాయుడు, అంగన్వాడీ ప్రాజెక్టు ఏరియా నాయకురాలు నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో రెండు ఆర్‌యూబీలు !

- గూడూరు రోడ్డులో 20 మీటర్ల వెడల్పుతో ఆర్‌యూబీ
- మచిలీపట్నం రోడ్డులో 30 మీటర్ల వెడల్పుతో వంతెనల నిర్మాణానికి కసరత్తు
- రెండు చోట్ల నిర్మాణానికి ప్రాథమిక అంచనాలు

పెడన: పెడనలో రెండు ఆర్‌యూబీల నిర్మాణానికి అధికారులు సర్వే చేస్తున్నారు. రద్దీగా ఉండే రైల్వే గేట్లు వద్ద పై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని, వాటికి అవకాశం లేకపోతే అండర్ బ్రిడ్జిలు అయినా తప్పనిసరిగా నిర్మించాల్సిందేనని పేర్కొంటూ రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. వీటి అమలుకు పెడనలో తీవ్ర జాప్యం జరిగింది. ఏడాది క్రితమే రైల్వే శాఖ నుంచి ఆదేశాలు వచ్చినా ఎన్నికల నేపథ్యంలో స్పందన లేదు. తాజాగా మళ్లీ ఈ ఫైల్‌కు కదలిక రావడంతో రైల్వే అధికారులు స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులను సంప్రదిస్తున్నారు.

ప్రాథమిక సర్వే

ఆయా రైల్వేగేట్ల వద్ద అండర్ బ్రిడ్జిలను నిర్మించడానికి ఎంత భూసేకరణ చేయాలనే దానిపై నివేదికలు ఇవ్వాల్సిందిగా రైల్వే అధికారులు స్థానిక అధికారులను లిఖితపూర్వకంగా కోరారు. దీంతో మున్సిపల్ అధికారులు ప్రాథమిక సర్వే చేయడం ప్రారంభించారు. ఇటీవల మున్సిపల్, రెవెన్యూ, రైల్వే అధికారులు పరిశీలించడంతో ఆ ప్రాంతంలోని వారంతా తర్జనభర్జనలు పడుతున్నారు. ఇది కేవలం ప్రాథమిక అంచనాల కోసమేనని అధికారులు స్పష్టం చేయడం విశేషం.

గూడూరు రోడ్డులో..

పెడనలోని గూడూరు వెళ్లే మార్గంలో రైల్వేగేటు ఉంది. ఇది పడితే సుమారు అరగంటకుపైగా నిరీక్షించాల్సిన పరిస్థితి. దీని నుంచి గట్టెక్కడానికి ఇక్కడ బ్రిడ్జి తప్పనిసరి. ప్రస్తుతం ఈ గేటు నుంచి అటు ఇటు 170 మీటర్లు చొప్పున మొత్తం 340 మీటర్లు పొడవు ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు. 20 మీటర్ల వెడల్పు ఉండనుంది. ప్రస్తుతం వెడల్పు 6 మీటర్ల నుంచి 10 మీటర్లు మాత్రమే ఉంది. ఆరు మీటర్లు ఉంటే మరో 14 మీటర్లు కావాల్సి ఉంటుంది. అంటే రెండు పక్కల ఏడు మీటర్ల చొప్పున సేకరణ చేయాల్సి ఉంది.



పెడనలోని గూడూరు దారిలో రైల్వేగేటు

మచిలీపట్నం వెళ్లే మార్గంలో..

పెడన నుంచి మచిలీపట్నం వెళ్లే ప్రధాన రహదారిలోని రైల్వేగేటు వద్ద 30 మీటర్ల వెడల్పుతో రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. పొడవు కూడా 170 చొప్పున 340 మీటర్లు పొడవు నిర్మించనున్నారు. ఇక్కడ భూ సేకరణ అంతా రైల్వే, మున్సిపల్, ఆర్ అండ్ బీ స్థలాలు మాత్రమే ఉన్నాయి. ప్రైవేటు భూములు తక్కువ.

రెట్టింపు ధర చెల్లించనున్నారు

ప్రాథమిక సర్వే తర్వాత స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చే వారికి రెట్టింపు ధరను చెల్లించనున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం బయట నడుస్తున్న రేటు సెంటు రూ.7లక్షలు నుంచి రూ.10 లక్షలు పలికితే రిజిస్ట్రేషన్ శాఖలో ఆ ధర రూ.15లక్షలుంటే దాని ప్రకారం రూ.30లక్షలు ఇవ్వనున్నారు. ఇలా మార్కెట్ రేటు ప్రకారం భూసేకరణ సమయంలో స్థలం నష్టపోయిన వారికి పరిహారం కింద ఇవ్వనున్నారు.



పెడన నుంచి మచిలీపట్నం వెళ్లే మార్గంలో రైల్వేగేటు

అంచనాల కోసం ప్రాథమిక సర్వే



రైల్వేశాఖ నుంచి అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రాథమిక అంచనాలను వేసి ప్రతిపాదనలను పంపించాలని కోరుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. వీటి ప్రకారం ప్రాథమిక అంచనాలను రూపొందిస్తున్నాం. వారు ఇచ్చిన కొలతల ప్రకారం అండర్ గ్రౌండ్‌లో రోడ్డు, డ్రెయినేజీతో పాటు పక్కన సర్వీసు రోడ్లు కూడా ఉండేలా పరిశీలించి అంచనాలు రూపొందించి పంపించాలన్నారు. ఎంత మంది నుంచి భూసేకరణ చేయాలి, యాజమానులు ఎంత మంది ఉన్నారు, తదితర వివరాలను సేకరించాలి. ఈ ప్రక్రియ ప్రస్తుతం మున్సిపల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం చేపట్టింది. కేవలం అంచనాలు మాత్రమే తయారు చేస్తున్నాం.

–కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

యువతకు ఆదర్శం 'టంగుటూరి'

మచిలీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం గొడుగుపేటలో నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి మిత్ర మండలి ప్రతినిధులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి, రాజనీతిజ్ఞుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వ్యక్తిగత, రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. న్యాయవాదిగా ఆరోజుల్లో లక్షల రూపాయల ప్రాక్టీస్‌ని త్యజించి, దేశ స్వాతంత్రమే ముఖ్యమని స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన త్యాగమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నేతాజీ మిత్రమండలి కో-కన్వీనర్ దూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, కూనపరెడ్డి శ్రీనివాస్, పీవీ ఫణి కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కౌలు రైతులకు పంటసాగుదారు హక్కుపత్రం అందిస్తాం

తహసీల్దార్ బి.విజయప్రసాద్

కొడాలి(ఘంటసాల): కౌలు చేసే ప్రతి రైతుకు పంట సాగుదారు హక్కుపత్రం అందిస్తామని ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం కొడాలి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతులకు, యజమానులకు పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ఘంటసాల మండలంలో 2,650 మందికి పంటసాగుదారు హక్కు పత్రాలు జారీ చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సీసీఆర్సీ కార్డులు కేవలం 11 నెలలు మాత్రమే పని చేస్తాయని, భూమి యజమానులకు, పంటసాగు చేసే కౌలుదారు ఇద్దరికీ ఇబ్బంది లేని విధంగా పటిష్టమైన చట్టం ద్వారా కౌలు గుర్తింపు కార్డులు అందిస్తారన్నారు. సీసీఆర్సీ కార్డులు తీసుకోవాల్సిన కౌలు రైతులు సాగు చేసే భూమి వివరాలతో పాటు కౌలుదారు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో గ్రామ వీఆర్వోను సంప్రదించాలని తహసీల్దార్ విజయప్రసాద్ తెలియజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ, వీఏఏ వి.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా

కృత్తివెన్ను: రాయితీపై పశువుల దాణాను పాడి రైతులకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. నీలిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా అందజేస్తుందన్నారు. మండలానికి 16.5 టన్నులు వచ్చాయని, వీటిని నీలిపూడి, నిడమర్రు-2 గ్రామ సచివాయాలు ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎస్.సుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ అందరి బాధ్యత

కంకిపాడు: హెచ్ఐవీ నియంత్రణ అందరి బాధ్యత అని కళాజాతా బృందం పేర్కొంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పునాదిపాడు గ్రామంలో హెచ్ఐవీ, లెప్రసీ నియంత్రణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ బృందం కళాకారులు వీధి నాటికల ద్వారా హెచ్ఐవీ, రక్తదాన శిబిరాలు, ఏఆర్‌టీ కేంద్రాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రాజెక్టు మేనేజర్ సుజాత, పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

తోట్లవల్లూరు: యాకమూరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణ తొలగింపునకు అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి స్థానిక బస్‌షెల్టర్ వద్ద తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిని సుమారు రెండు సెంట్లు ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపట్టాడు. దీనిపై అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ఆర్‌అండ్‌బీ రహదారి స్థలంలో నిర్మించిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి నాగుల్‌మీరా, ఆర్‌అండ్‌బీ ఏఈఈ మల్లికార్జున, వీఆర్‌ఓ అక్బర్ బాషా, పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణ తొలగింపు పనులను చేపట్టారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక బేతవోలు లోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నసమారాధన నిర్వహించారు. సేవాసంఘం సభ్యుడు సీహెచ్ సత్యనారాయణ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన



గూడూరు: కిశోర బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టార్ సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా తరకటూరు శివారు పర్ణశాల అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులతో మంచి ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన తరగతులు



గూడూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. గూడూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు పలు ఆటల పోటీల్లో ఆసక్తిగా పాల్గొంటున్నారు. చెస్, క్యారమ్స్, లూడో తదితర విభాగాల్లో మెలకువలు తెలుసుకుంటున్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం



చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లికి తనవంతుగా స్వచ్ఛ కార్యకర్త వేమూరి అర్జునరావు రూ.10వేలు విరాళాన్ని మంగళవారం స్వచ్ఛ రథసారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు. తన మనుమరాలు లక్ష్మీ వివాహం సందర్భంగా ఈ మొత్తాన్ని నగదు రూపంలో మన కోసం మనం ట్రస్టుకు అందజేస్తున్నట్లు అర్జునరావు తెలిపారు.

ప్రజా విజ్ఞప్తుల సేకరణలో కచ్చితత్వం ఉండాలి

పెడన: ప్రజలు తమ సమస్యలను వివరంగా తెలియజేస్తూ వినతుల రూపంలో అందిస్తారని, వాటి పరిష్కారంలో సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని పీజీఆర్ఎస్ సీఎంవో కార్యాలయం నుంచి అధికారులు స్పష్టం చేశారని పెడన ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పీజీఆర్ఎస్ సీఎంవో కార్యాలయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీవో అరుణకుమారి, ఏవో నూరున్నీసా, ఎస్ఐ సత్యనారాయణ, పీఆర్ఏఈ ధర్మయ్య, ఎంఈవో-2 హరనాథ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 80 మందికి 76 మంది హాజరవ్వగా నలుగురు ఆబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 82 మందికి 75 మంది హాజరయ్యారని, ఏడుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 19వ డివిజన్ పాతరామన్నపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చందా అనీల్, రాణి వివాహం మంగళవారం జరిగింది. స్థానిక ఆర్సీఎం చర్చిలో జరిగిన వీరి వివాహ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కృష్ణా జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, డివిజన్ ఇన్‌చార్జ్ బూరగ రామారావు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుందరకాండ హోమం



బంటుమిల్లి: పాశ్చాపురంలోని శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో సుందరకాండ హవనము (హోమం) మంగళవారం వైభవంగా జరిగింది. హనుమజ్జయంతి ఉత్సవాల్లో రెండో రోజు ద్వారకా తిరుమల వేద పాఠశాల అధ్యాపకులు డీవీ మేఘనరసింహాచార్యులు సుందరకాండ పఠనం చేస్తూ అందులోని శ్లోకాల అర్థాలను వివరిస్తూ నిర్వహించిన హోమం భక్తుల మనస్సులను రంజింపజేసింది. ప్రధాన అర్చకులు రొంపిచర్ల హనుమంతాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం కోలాట బృందం వేసిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

పెడన: హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ హనుమాన్ శోభాయాత్ర ఉంటుందని, దీన్ని జయప్రదం చేయాల్సిందిగా హిందూ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెండ్ల కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శోభాయాత్ర పిండివారిపాలెం నుంచి బయలుదేరి తొమ్మిది దేవాలయాలను సందర్శించి చివరకు పెడన బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద ముగుస్తుందని వివరించారు.